క్లుప్తంగా...

నేడు భగవద్గీతపై హబ్సిగూడలో కవి సమ్మేళనం

సాక్షి, హైదరాబాద్: వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే భగవద్గీతపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో తొలిసారి భగవద్గీతపై సత్యశోధన– శక్తిసాధన, శ్రీ భగవద్గీత పబ్లిసిటీ సొసైటీ ఆధ్వర్యంలో కవిసమ్మేళనాన్ని ఏర్పాటు చేసినట్లు శ్రీ భగవద్గీత పబ్లిసిటీ సొసైటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు హబ్సిగూడ మూడో వీధిలోని ఇం.నెం .2–19/4 లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. గీతావధాని డాక్టర్ యడ్లపల్లి మోహన్‌రావు ఆధ్వర్యంలో శ్రీభగవద్గీతపై సమీక్ష సమావేశం ఉంటుందన్నారు. వివరాలకు మొబైల్ నెంబర్ 9490440178లో సంప్రదించాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

బల్కంపేటకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కాప్రా: ఈ నెల 19, 20వ తేదీల్లో జరిగే బల్కంపేట ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు టీఎస్‌ఆర్టీసీ కుషాయిగూడ డిపో పరిధిలోని ఈసీఐఎల్, నాగారం, దమ్మాయిగూడ, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్ తెలిపారు. ఉదయం 6 గంటల నుండి ప్రతి అరగంటకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని ఆయా ప్రాంతాల వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యా వలంటీర్లను కొనసాగించాలి

డీఈఓకు టీయూటీఎఫ్ జిల్లా శాఖ వినతి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాల్లో వివిధ సంస్థల ద్వారా పని చేస్తున్న విద్యా వాటంటర్స్‌ను యధావిధిగా కొనసాగించాలని మేడ్చల్ జిల్లా తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారికి తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆర్. వేంకటేశ్వర్లు, ఊరెల్ల విఠల్ వినతి పత్రం అందజేశారు. పాఠ్య పుస్తకాలను స్కూల్ పాయింట్‌కు చేరవేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలల్లో అదనంగా ఉపాధ్యాయులను(విద్యా వలంటీర్లను) నియమించాలన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

జవహర్‌నగర్: డివిజన్ పరిధిలో మౌలిక వసతులకు కల్పనకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ నిహారికగౌడ్ అన్నారు. శనివారం ఆమె జవహర్‌నగర్ కార్పొరేషన్ 28వ డివిజన్ ముత్యస్వామి కాలనీ, ఆదర్శ్ కాలనీ, రేణుకనగర్ కాలనీల్లో రూ.90 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో డివిజన్‌ను మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు రమేష్‌చారి, డివిజన్ అధ్యక్షులు బూడిద వెంకటేష్, నాయకురాలు మంజుల, శ్వేత, సుధ, ఎల్లమ్మ, కాలనీవాసులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

పోచారం: అన్నోజిగూడలోని ఎల్ఎన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి శనివారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలోని 152 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్ రాజశేఖర్, బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్, హెచ్ఎం శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంపై ఆరోపణలు అవాస్తవం

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ మల్లన్న గుడి నిర్మాణంపై కొందరు వ్యక్తులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తూంకుంట గ్రామస్తులు,యాదవసంఘం సంభ్యులు ఆరోపించారు. శనివారం తూంకుంట గ్రామస్తులు, యాదవసంఘం సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ... స్వయం భూ శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో అయ్యప్ప, మల్లిఖార్జున ఆలయాలు కొనసాగుతున్నాయన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో మల్లిఖార్జున ఆలయాన్ని పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. దీనిని జీర్ణించుకోలేకనే కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆలయ నిర్మాణంపై విషయమై దేవాదాయ శాఖ అనుమతి కోరినట్లు తెలిపారు. భూమి దేవాదాయ శాఖకు చెందినదని, ఈ విషయంలో ఎవరికైనా అనుమానాలు ఉంటే బహిరంగంగా తెలియజేయాలన్నారు. పై విషయమై దేవాదాయ శాఖ ఈఓ వెంకన్నను వివరణ కోరగా తూంకుంట స్వయంభు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్వహణ, భూముల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మల్లన్న గుడి నిర్మాణంపై దేవాదాయ శాఖ అనుమతి తీసుకోవాలని నిర్వాహకులకు సూచించామన్నారు.

ఆసరా లేక నిరాశ

- ఆగష్టు నుంచి కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకునే వెబ్‌సైట్ నిలిపివేత
- జనవరి నుంచి స్పౌజ్ దరఖాస్తులకు మాత్రమే అవకాశం
- భర్త లేదా భార్య చనిపోయిన వారి నుంచి మాత్రమే దరఖాస్తుల స్వీకరణ
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దరఖాస్తుదారులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: ఆసరా పింఛను లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. దరఖాస్తుల కోసం మండల పరిషత్ కార్యాలయాల్లో అవకాశం లేకపోవడంతో లబ్ధిదారులకు నిరాశే ఎదురవుతోంది. దరఖాస్తుల కోసం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్ దాదాపు 11 నెలలుగా నిలిపివేయడంతో తమ పింఛన్లకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

– ఆగస్టు నుంచి నిలిపివేత...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 1,47,778 ఆసరా పింఛన్లకు ప్రతి నెలా రూ.36.48 కోట్లు కేటాయిస్తున్నారు. కొత్త పింఛన్ కోసం మండల పరిషత్, మున్సిపల్ సర్కిల్ కార్యాలయాలు, పురపాలక సంఘాల కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపడతారు. అర్హుల పేర్లను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి డీఆర్డీఓకు, అనంతరం సెర్ప్ ప్రధాన కార్యాలయానికి పంపిస్తారు. అక్కడి నుంచి పింఛన్ మంజూరు చేస్తే వాటిని లబ్ధిదారులకు అందజేస్తారు. గతేడాది ఆగస్టులో పింఛను దరఖాస్తుల వెబ్‌సైట్‌ను నిలిపివేశారు. దీనిపై సమాచారం లేకపోవడంతో పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గత జనవరి నుంచి కేవలం స్పౌజ్ పింఛన్ దరఖాస్తులకు మాత్రమే అవకాశం కల్పించారు. దీంట్లో భర్త వృద్ధాప్య పింఛన్ పొందుతూ మరణిస్తే అతని భార్యకు దానిని బదలాయిస్తున్నారు. కొత్త దరఖాస్తులను వెబ్‌సైట్ తీసుకోవడం లేదు. స్పౌజ్ పింఛన్ల కోసం జనవరి నుంచి ఇప్పటి వరకు నెలకు 50 నుంచి 70 చొప్పున 400 పైగా దరఖాస్తులకు అవకాశం కల్పించారు. గతేడాది ఆగష్టు కంటే ముందు జిల్లాలో 3,457 మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు ఏడాదిగా జిల్లాలో భర్తలు చనిపోయినవారు, వృద్ధాప్య, దివ్యాంగుల తదితర పింఛన్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకునే అవకాశం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాంకేతిక సమస్యలు ఇతర కారణాలతో లబ్ధిదారులకు పింఛన్లు అందకుండా పోతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఆదేశాలు రాగానే చర్యలు..

కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రస్తుతం స్పౌజ్ మినహా మిగతా వారికి అవకాశం లేదు. ఆగష్టు నుంచి కొత్త పింఛన్ల దరఖాస్తులకు అప్‌లోడ్ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగానే అర్హులందరి దరఖాస్తులకు ప్రతిపాదనలు పంపించి మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఆగష్టుకు ముందు ప్రభుత్వం జిల్లాకు 48 వేల కొత్త పింఛన్లు మంజూరు చేయగా, వారికి ప్రతి నెల పింఛన్ డబ్బులు అందుతున్నాయి.

–పద్మజారాణి, డీఆర్‌డీఓ, మేడ్చల్ జిల్లా

డిజిటల్ అగ్రికల్చర్‌తో రైతులకు మేలు



సెమినార్‌లో పాల్గొన్న ప్రొఫెసర్లు

మేడ్చల్‌రూరల్: వ్యవసాయ పనులను సులభతరం చేసేందుకు డిజిటల్ అగ్రికల్చర్ దోహదపడుతుందని రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సమీర్‌కుమార్, సెయింట్ పీటర్స్ కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో చాలెంజెస్ ఆన్ డిజిటల్ అగ్రికల్చర్ పై మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సెమినార్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులు డిజిటల్ యంత్రాలను ఉపయోగించేందుకు శిక్షణ ఇవ్వాలన్నారు. సెమినార్‌లో పాల్గొన్న మల్లారెడ్డి, గీతం, కేఎల్ యూనివర్సిటీల ప్రతినిధులు మోహన్, రామకృష్ణ, డీవీ రమణ,రామాంజనేయులు ఇంట్రడక్షన్ టు టెక్నాలజీ సపోర్ట్ టు అగ్రికల్చర్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్‌పై, చాలెంజర్స్ ఇన్ డిజిటల్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్ ప్రొడక్టివిటీ ఇంప్రూవింగ్ క్రాప్స్‌పై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్ సరోజరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయలక్ష్మి,ప్రసన్నకుమార్, పీఆర్ఓ రవిసుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను శనివారం కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్ గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఉచితంగా బుక్స్ , యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, డిజిటల్‌క్లాసులు, అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో చదువులు బోధించడం, తదితర కార్యక్రమాలను చేపడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కౌకుట్ల తిరుపతిరెడ్డి, నేతలు శ్రీకాంత్‌గౌడ్, మల్లారెడ్డి, పాండుగౌడ్, రాజుముదిరాజ్, శ్రీరాములు, ఎల్లయ్య, సాయిలత, ఉపాధ్యాయుడు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత భవిష్యత్తు


మైక్‌సెట్‌ను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, దాత నీరజ్‌గౌడ్

శామీర్‌పేట్: కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని మేడ్చల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలం, కేశవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు దాతలు జంగయ్యయాదవ్ సహకారంతో 10 సీలింగ్‌ఫ్యాన్లు, , గోనె మహేందర్‌రెడ్డి సహకారంతో 400 నోట్‌బుక్స్, నీరజ్‌గౌడ్ సహకారంతో మైక్‌సెట్ అందజేశారు. శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ వాటిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్‌కు అందజేశారు. ప్రతి ఒక్కరూ శ్రద్ధతో చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మూడుచింతలపల్లి మండల అధ్యక్షుడు నర్సింలుయాదవ్, మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ భద్రతలో కమాండెంట్ల సేవలు అభినందనీయం


గౌరవ వందనం స్వీకరిస్తున్న పీయూష్ ఆనంద్


యోగాసనాల విన్యాసం

జవహర్‌నగర్: దేశభద్రతలో కమాండెంట్ల సేవలు అభినందనీయమని సీనియర్ పోలీసు ఉన్నతాధికారి పీయూష్ ఆనంద్ అన్నారు. హకీంపేటలోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (నిసా) పరేడ్ గ్రౌండ్‌లో 46వ బ్యాచ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కమాండెంట్స్ పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీయూష్ ఆనంద్ మాట్లాడుతూ.. దేశ భద్రతలో కమాండెంట్ల సేవలు అభినందనీయమన్నారు. నిసాలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్తమ శిక్షణ అందించారన్నారు. సమాజంలో పోటీతత్వం పెరిగిందని, క్రమశిక్షణతో ముందుకు సాగితే అన్నిరంగాల్లో విజయం సాధ్యమన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన కమాండెంట్స్‌కు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా కమాండెంట్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నిసా డైరెక్టర్ కె.సునీల్ ఇమ్మాన్యుయేల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌పై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు కౌన్సిలర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు అబ్బాస్ అలీ అన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి దిష్టిబొమ్మను దహనం చేశారు.

మద్యం కోసం గొడవ.

యువకుడి మృతి


దుర్గేశ్ మృతదేహం

మేడ్చల్‌రూరల్: మద్యం కోసం జరిగిన గొడవ ఒకరి మృతికి దారితీసింది. మద్యం ఇప్పించాలని కోరిన యువకుడిపై పలువురు దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మేడ్చల్ పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన దుర్గేశ్(30) స్థానిక ఎరుకల బస్తీలో ఉంటూ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న అతను తోటి కార్మికుడు సూరజ్, అతని స్నేహితులను తమకు మద్యం ఇప్పించాలని కోరగా వారు నిరాకరించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆగ్రహానికిలోనైన సూరజ్, అతని స్నేహితులు దుర్గేశ్‌పై దాడి చేయడంతో అతను కుప్పకూలాడు. దుర్గేశ్ మృతి చెందినట్లు గుర్తించిన వారు అతడిని గదిలో పడుకోబెట్టి వెళ్లాలని ప్రయత్నించగా అప్పటికే స్థానికులు అక్కడికి చేరుకోవడంతో వీలు కాలేదు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరికి గాయాలు


గాయపడిన భాస్కర్, వరుణ్

శామీర్‌పేట్: గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన శనివారం మూడుచింతలపల్లి మండలం, ఆద్రాస్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన భాస్కర్ శనివారం ఇంట్లో సిలిండర్ మారుస్తుండగా రెగ్యులేటర్ సరిగా బిగించకపోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి సిలిండర్ పేలింది. పేలుడు దాడికి ఇంట్లో వస్తువులు చెల్లాచెదురుగా పడిపోయాయి. భాస్కర్‌తో పాటు కుమారుడు వరుణ్‌కు గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



శామీర్‌పేట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శనివారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శామీర్‌పేట కట్ట మైసమ్మ బ్రిడ్జి కింద మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు శామీర్‌పేట పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

మంచినీటి పండగను విజయవంతం చేయండి

- ఇంటింటికీ నీటి సరఫరాపై ప్రచారం చేయాలి
- మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం సూచించిన మేరకు ఈనెల 18న (ఆదివారం) మంచినీటి పండగ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. మంచినీటి పండగ సందర్భంగా డబుల్‌పురాలో నిర్వహించనున్న కార్యక్రమాల్లో రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, పాత్రికేయులతోసహా వివిధ వర్గాల ప్రజలు మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్స్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లను సందర్శించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామాల నుంచి మొదలుకొని పట్టణాల్లో ఇంటింటికీ నల్లాల ద్వారా మంచి నీరు సరఫరా జరుగుతున్న తీరును మంచినీటి పండుగ రోజున ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత నీటి కోసం ఎలాంటి ఇబ్బందులు లేని విషయాన్ని తెలపాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి ఉచితంగా నల్లాలు బిగించి స్వచ్ఛమైన, సురక్షితమైన నీటిని అందిస్తున్న తీరును ఈ సందర్భంగా నిర్వహించే సభల్లో వివరించాలన్నారు. ఇందులో సెర్ప్ ఉద్యోగులందరినీ భాగస్వాములను చేయాలని ఆదేశించారు.

పదేళ్లలో వందేళ్ల అభివృద్ధి


గిరిజన దినోత్సవంలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి, జెడ్పీ చైర్మెన్ శరత్‌చంద్రారెడ్డి


గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి

మేడ్చల్‌రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలోనే వందేళ్ల అభివృద్ధి సాధించామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మండలంలోని సైదోనిగడ్డ తండాలో రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో భాగంగా శనివారం గిరిజన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డితో కలిసి పాల్గొన్న మంత్రి భోగ్ బండర్ లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజన సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. దశాబ్దాలుగా అణిచివేతకు గురైన గిరిజనులు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించారన్నారు. గిరిజన రిజర్వేషన్, పోడు భూములకు పట్టాలు, గిరిజన తండా అభివృద్ధి తదితర సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. గిరిజన విద్యాలయాల ఏర్పాటుతో గిరిజనుల సంస్కృతిని కాపాడామన్నారు. గత పాలకుల హయాంలో గిరిజన సంక్షేమానికి రూ.6 వేల కోట్లు ఖర్చు చేయగా, కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో రూ.53 వేల కోట్లు ఖర్చు చేసి వారికి అన్ని విధాలా అండగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమంపై ఏర్పాటు చేసిన కరపత్రాలను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుజాతా కిషన్‌నాయక్, లంబాడ సంక్షేమ సమితి అధ్యక్షులు ధన్‌రాజ్ నాయక్, జిల్లా రైతు బంధు అధ్యక్షులు నందారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీలు శైలజ, అనిత, ఆర్డీఓ రవి, ఎంపీడీఓ పద్మావతి, తహశీల్దార్ సరిత, వైస్ ఎంపీపీ వెంకటేశ్, ఎంపీటీసీ కుమార్‌యాదవ్, సర్పంచులు, గిరిజనులు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు


పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందాయని జవహర్‌నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. 8వ డివిజన్ సంతోష్‌నగర్ కాలనీలో కాలనీ వాసులు భాగస్వామ్యం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ సొంత నిధులతో శనివారం భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, మంత్రి మల్లారెడ్డి సహకారంతో జవహర్‌నగర్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, శ్రీనాథ్, శ్రీమన్, కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, నర్సింహులు, రజిత, భారతి, రమా, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు


మర్రి రాజశేఖర్‌రెడ్డికి గొర్రెపిల్లను బహుకరిస్తున్న పూడూర్ సర్పంచ్, నాయకులు


శుభాకాంక్షలు తెలుపుతున్న భాస్కర్‌యాదవ్ తదితరులు

ఘట్‌కేసర్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ ఆధ్వర్యంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లేశ్, జహంగీర్, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్ ముదిరాజ్, జంగయ్యయాదవ్, నర్సింగ్‌రావు, రాధాకష్ణముదిరాజ్, రాజు, జగదీశ్, ఫయూమ్, విజయ్‌ముదిరాజ్, సురేశ్, నరేశ్ పాల్గొన్నారు.

మండల నాయకుల శుభాకాంక్షలు...

మర్రి రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు మండలంలోని పలు గ్రామాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ భాస్కర్ యాదవ్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్లు దీపిక నర్సింహారెడ్డి, మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు ర్యాలీ తరలివెళ్లి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

శుభాకాంక్షలు...

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, వసుపతి , వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బండారిమల్లేష్‌యాదవ్, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, తదితరులు మర్రి రాజశేఖర్ రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న పావనీయాదవ్


శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ